aruhi
aruhi group
BBTV
BBTV TELUGU

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
12-11-2026
సంపుటి : 01 సంచిక :229 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

మద్యం అమ్మకాల్లో భారత్ జోరు!

- అమెరికా, చైనాలను మించి భారత మార్కెట్‌లో భారీ వృద్ధి
- ప్రపంచవ్యాప్తంగా తగ్గిన మద్యం వినియోగం
- భారత్‌లో మాత్రం 10 శాతం పెరిగిన అమ్మకాలు
- 21 ప్రధాన మార్కెట్లలో అత్యధిక వృద్ధి నమోదు
- బీర్ విక్రయాల్లో 16 శాతం వృద్ధి
- రెడీ టు డ్రింక్ పానీయాల అమ్మకాలు 12 శాతం పెరుగుదల
- ఇండియన్ విస్కీకి నాలుగు శాతం, బ్లెండెడ్ స్కాచ్‌కు ఎనిమిది శాతం వృద్ధి

03





03

కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు..

- కుల్గాం జిల్లాలో సీఆర్పీఎఫ్ సిబ్బందిపై ఉగ్రదాడి
- అఖ్రాన్ ప్రాంతంలోని చెక్‌పోస్టు వద్ద కాల్పులు
- మిర్ బజార్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఘటన
- మోటార్‌సైకిళ్లపై వచ్చి కాల్పులకు తెగబడిన దుండగులు
- ఎదురుకాల్పులు జరిపిన అప్రమత్తమైన సీఆర్పీఎఫ్ సిబ్బంది
- ఘటనలో ముగ్గురు జవాన్లకు గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల విస్తృత గాలింపు



భారత్ సమ్మిట్‌కు సహకరించాలి

- భారత్ సమ్మిట్--2 విజయవంతానికి అందరి భాగస్వామ్యం అవసరం
- గత ఏడాది భారత్ సమ్మిట్--2025 విజయవంతమైందని వెల్లడి
- గత సదస్సుకు దేశ, విదేశీ ప్రతినిధుల హాజరు
- రాహుల్‌గాంధీ సహా పలువురు జాతీయ నాయకుల భాగస్వామ్యం
- ఈసారి 70 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధుల రాక
- తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం
- ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయంపై చర్చలు
- సదస్సు విజయవంతానికి అన్ని వర్గాలు సహకరించాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు

హైదరాబాద్ నవంబర్ 11(మహా ప్రభ)

తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అభివృద్ధిపై చర్చలకు భారత్ సమ్మిట్ కీలక వేదికగా నిలవనుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. భారత్ సమ్మిట్--2ను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. గత ఏడాది నిర్వహించిన భారత్ సమ్మిట్--2025కు దేశ, విదేశాలకు

-మిగతా 3 లో

వచ్చే ఏడాది నుంచి 10+2 విద్యా విధానం



- విద్యారంగంలో సమూల సంస్కరణలకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం
- నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య
- 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ విద్య
- 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ
- భాషా, సమాచార నైపుణ్యాలపై విద్యార్థులకు పట్టు కల్పించాలి
- పదో తరగతి తర్వాత డ్రాపౌట్లను అరికట్టడమే లక్ష్యం
- సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు సొంత భవనాలు
- విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్ నవంబర్ 11(మహా ప్రభ)

విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రంలో విద్యా సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యాశాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో వచ్చే ఏడాది నుంచి 12వ తరగతి వరకు నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త విధానం ప్రకారం నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్య, తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు సీనియర్

-మిగతా 3 లో



ఐపీఎల్‌లో మరో రెండు జట్లు?

- ప్రస్తుతం పది జట్లతో కొనసాగుతున్న ఐపీఎల్‌ను 12కు పెంచే యోచన
- కొత్త ఫ్రాంచైజీల ప్రవేశానికి బీసీసీఐ కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం
- 2028 సీజన్ నుంచి కొత్త జట్లు రంగంలోకి వచ్చే అవకాశం
- పుణే, వడోదర నగరాల పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం
- 2008లో ఎనిమిది జట్లతో ప్రారంభమైన ఐపీఎల్
- 2022లో గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ రాకతో పదికి చేరిన జట్లు



03



మూసీ ప్రక్షాళనకు గ్రీన్‌సిగ్నల్

- అన్ని అనుమతులు లభించాయి.. త్వరలో టెండర్లు
- కి.మీ. మూసీలో తొలివిడతగా 21 కి.మీ. పునరుజ్జీవనం
- తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- చెరువు విస్తీర్ణం 14 నుంచి 30 ఎకరాలకు పెంపు
- రెండు ఎకరాల భూమిని అందించిన నాగార్జునకు ప్రశంసలు
- నగరంలో 1,372 చెరువులు ఉండగా.. సగం కనుమరుగు
- మూసీ కాలుష్యంతో నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- బాధితులకు నష్టం జరగకుండా ఆదుకుంటామని సీఎం భరోసా

హైదరాబాద్ నవంబర్ 11(మహా ప్రభ)

హైదరాబాద్ ప్రజల భవిష్యత్తుకు కీలకమైన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు అన్ని అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. 55 కిలోమీటర్ల మూసీలో తొలివిడతగా 21 కిలోమీటర్ల మేర పునరుజ్జీవన పనులు చేపడతామని చెప్పారు.

-మిగతా 3 లో

కేసీఆర్ హయాంలో రైతే రాజు

-రైతుబంధు లేదు.. 24 గంటల కరెంటు లేదు.. సాగునీటి భరోసా కరువైంది


- కాంగ్రెస్ పాలనలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోంది
- కాళేశ్వరం నీటిని సముద్రంలోకి వదులుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- ఎస్సారెస్పీకి రావాల్సిన 90 టీఎంసీల నీటిని నిలిపివేశారని విమర్శ
- మేడిగడ్డ మరమ్మతులను పట్టించుకోకుండా తమ్మిడిహెట్టి పేరుతో కొత్త డ్రామాలు
- యూరియా కోసం రోజుల తరబడి క్యూలైన్లలో రైతుల నిరీక్షణ
- మిషన్ కాకతీయతో 46 వేల చెరువుల పునరుద్ధరణ
- రైతుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు
- రైతు గర్జన బహిరంగ సభలో కేటీఆర్



నిర్మల్, నవంబర్ 11(మహా ప్రభ)

కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతును రాజులా చూసుకుంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. రైతుబంధు సాయం అందడం లేదని, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా లేదని, సాగునీటి పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన రైతు గర్జన


-మిగతా 3 లో



03

అమూల్, మదర్ డెయిరీ పాల ధరల పెంపు

- లీటరుపై రూ.2-4 వరకు పెంచిన సంస్థలు
- రైతుల నుంచి కొనుగోలు ధరలు పెరగడమే ప్రధాన కారణం



03


కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు మూసివేత

- ఈ ఏడాది 19.20 లక్షలకు పైగా భక్తుల దర్శనం
- మంత్రోచ్ఛారణలు, సైనిక బ్యాండ్ మధ్య కార్యక్రమం

అంతరిక్షంలో చైనా అద్భుతం..

- విశ్వంలోనే అత్యంత శీతల ఉష్ణోగ్రతను సృష్టించిన డ్రాగన్ కంట్రీ!
- చైనా తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌లో శాస్త్రవేత్తల సరికొత్త రికార్డు
- విశ్వంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత 9.7 పికోకెల్విన్లు నమోదు
- రుబీడియం-87 అణువులను లేజర్లతో చల్లబరిచి ఈ ఘనత
- మైక్రోగ్రావిటీ వాతావరణంలో పరిశోధనలకు మార్గం సుగమం
- క్వాంటం సెన్సార్లు, భౌతిక శాస్త్ర అధ్యయనాలకు ఈ ప్రయోగం కీలకం

03



దీపావళికి టపాసులు కాలిస్తే తప్పేంటి?

- దీపావళి టపాసులపై యోగి ఆదిత్యనాథ్ హర్షం
- ఒక్కరోజు సంబరాలతో కాలుష్యంపై ఆందోళన ఎందుకని ప్రశ్న
- అయోధ్యలో తానూ బాణసంచా కాల్చినట్లు వెల్లడి
- పండుగలపై ఆంక్షలను తమ ప్రభుత్వం ప్రోత్సహించదని స్పష్టీకరణ
- అవినీతితో వ్యవస్థను కలుషితం చేసేవారిని ప్రశ్నించడం లేదని విమర్శ

03



పట్టాలు తప్పిన రైలు 50 మందికి గాయాలు

అస్సాంలో ఘటన



డిస్పూర్:, నవంబర్ 11(మహా ప్రభ)

అస్సాంలోని కామ్రూప్ జిల్లాలోని దిగారు రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం రైలు ప్రమాదం జరిగింది. కోల్‌కతా–సైరాంగ్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో సుమారు 50 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఇందులో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తున్నది. మరో రైలుకు దారి ఇచ్చే సమయంలో రైలు వేగాన్ని నియంత్రించలేకపోవడంతో పక్క ట్రాక్‌పై ఏర్పాటు చేసిన బారికేడ్లను రైలు ఢీకొట్టిందని రైల్వేశాఖ తెలిపింది. సిగ్నల్ ఫెయిల్ అయిందని, అత్యవసర వ్యవస్థ పనిచేయట్లేదని, ఇంజిన్‌లో కొన్ని పనిచేయట్లేదంటూ లోకో పైలట్ ఒక వీడియోలో చెప్పడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఫేక్ కోర్టు ఆర్డర్లతో
బెట్టింగ్ వెబ్‌సైట్ల మూత

-రెండు ఫోర్జరీ ఆర్డర్లతో 129 వెబ్‌సైట్లకు షాక్
-కేంద్ర ప్రభుత్వం నిర్వాకం
-ఓ వార్తా సంస్థ పరిశోధనలో వెల్లడి



న్యూఢిల్లీ నవంబర్ 11(మహా ప్రభ)

129 చట్ట విరుద్ధ బెట్టింగ్ వెబ్‌సైట్లను మూసివేయించడానికి టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ నకిలీ కోర్టు ఆర్డర్లను ఉపయోగించినట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది. ఈ వెబ్‌సైట్లను బ్లాక్ చేయాలని ఇంటర్నెట్ ప్రొవైడర్లకు జూలై 21న, సెప్టెంబర్ 2న ఆదేశాలు ఇచ్చిందని, ఈ ఆదేశాలకు రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల హైకోర్టులు ఇచ్చిన ఆదేశాలుగా పేర్కొంటూ కొన్ని పత్రాలను జత చేసిందని వివరించింది. అయితే, ఆ కోర్టు ఆర్డర్స్ సంబంధిత హైకోర్టుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ రికార్డులలో లేవని తెలిపింది. రాజస్థాన్ హైకోర్టు రిజిస్ట్రార్‌ను ప్రశ్నించినపుడు, ఆ ఆర్డర్ మోసపూరితమైనదిగా కనిపిస్తున్నట్లు చెప్పారని పేర్కొంది. ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు ఈ ఫేక్ ఆర్డర్‌పై పోలీసులకు ఈ నెల 6న ఫిర్యాదు చేసినట్లు ఆ వార్తా సంస్థ తెలిపింది. రాష్ట్ర సీనియర్ సైబర్ క్రైమ్ అధికారి ఘనశ్యామ్ యాదవ్ స్పందిస్తూ, ఈ ఆర్డర్ అలహాబాద్ హైకోర్టు ఇచ్చినది కాదని, ఫేక్ ఆర్డర్ అని చెప్పారని పేర్కొంది. ఈ ఫేక్ ఆర్డర్లను ఎలా సృష్టించారు? అనే విషయంపై స్పష్టత లేదని తెలిపింది.

పాన్, ఓటరు కార్డులుపౌరసత్వానికి
ఆధారాలు కావు

గౌహతి హైకోర్టు తీర్పు


గౌహతి, , నవంబర్ 11(మహా ప్రభ)



భారత పౌరుడిగా నిరూపించడానికి పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు ఎంతమాత్రం ఆధారం కావని, గౌహతి హైకోర్టు స్పష్టం చేసింది. వాటికి ఆధారమైన మూల రికార్డులను కూడా నిరూపించినప్పుడే పౌరసత్వానికి సాక్ష్యాలుగా పరిగణించవచ్చునని జస్టిస్ కల్యాణ్‌రాయ్ సురానా, జస్టిస్ సుస్మితా ఫుకన్ ఖౌండ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. తనను విదేశీయురాలిగా ప్రకటిస్తూ ఫారినర్స్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ?ర2022లో ఆమెకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేసింది. తన తాత, నానమ్మ, తండ్రి అస్సాంలో నిరంతరంగా నివసించినట్లు నిరూపించడంలో ఆమె విఫలమైందని, 2018 నాటి రేషన్ కార్డ్, ఓటరు ఐడీ కూడా తండ్రితో ఆమెకున్న సంబంధాన్ని నిరూపించలేక పోయాయని వ్యాఖ్యానించింది. కేసును ట్రిబ్యునల్‌కు పంపించే అభ్యర్థనను తిరస్కరించింది.

ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై
రూ.1.8 లక్షలతో ల్యాప్‌టాప్ కొనుగోలు చేయొచ్చు
నాలుగేండ్ల తర్వాత సొంతానికీ వాడుకోవచ్చు

న్యూఢిల్లీ:, నవంబర్ 11(మహా ప్రభ)



ఆఫీసుల్లో తాము పనిచేస్తున్న ల్యాప్‌టాప్‌లను ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఇండ్లకు కూడా తీసుకువెళ్లవచ్చు. అయితే దీనికి షరతులు వర్తిస్తాయి. కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు పరికరాల కొనుగోలు పాలసీలో మార్పు చేసింది. దీని ప్రకారం కార్యాలయ వినియోగం కోసం అధికారులకు ప్రభుత్వం జారీ చేసే ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఇతర గ్యాడ్జెట్‌లు నాలుగేండ్ల పాటు వినియోగించిన తర్వాత వాటిని తమ వద్దే ఉంచుకోవచ్చు. ఆయా శాఖలు రూ.1.8 లక్షల లోపు విలువ చేసే యాపిల్ బ్రాండ్ మాడల్స్ కొనుగోలు చేసుకోవచ్చు.

తండ్రికి పంచిన తాత ఆస్తిపై
మనుమడికి జన్మతః హక్కు లేదు

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 11(మహా ప్రభ)



హిందూ వారసత్వ చట్టం, 1956 ప్రకారం తాత ఆస్తి ఆయన మొదటి తరగతి వారసులకు(మొదటి వరుస కుటుంబ సభ్యులు) సంక్రమించిన తర్వాత తండ్రికి కేటాయించిన ఆస్తిలో మనుమడికి జన్మహక్కు లభించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తాతగారి ఆస్తి పంపకంలో తన తండ్రికి లభించిన భూమిని తర్వాత అమ్మేశారని పేర్కొంటూ, అందులో సగం వాటా కోరుతూ ఒక వ్యక్తి దాఖలు చేసిన అప్పీలును జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్, జస్టిస్ సునీతా అగర్వాల్‌తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. తండ్రి తన వాటాకు వ్యక్తిగత హోదాలో ఏకైక యజమాని అయ్యాడని, ఆ ఆస్తి ఇకపై ఉమ్మడి హిందూ కుటుంబ లేదా సహభాగస్వామ్యంలో భాగం కాదని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ భూమి అప్పీలుదారుని తాతకు చెందినది.1993లో తాత కుమార్తె ఆస్తి పంపకం కోసం దావా వేసింది. 1994లో కుదిరిన రాజీ తీర్పు ప్రకారం వివాదాస్పద భూమి అప్పీలుదారుని తండ్రికి దక్కింది. అప్పీలుదారుడు 1994లో జన్మించాడు. 1997లో అతని తండ్రి ఆ భూమిని ఇద్దరు వ్యక్తులకు విక్రయించాడు. అప్పట్లో మైనర్‌గా ఉన్న అప్పీలుదారుడు తన తల్లి ద్వారా దావా వేస్తూ ఆస్తిలో సగం వాటాను విభజించి తనకు అప్పగించాలని కోరాడు. ఆ భూమి పూర్వీకుల ఉమ్మడి కుటుంబ ఆస్తి అని, జన్మతః తనకు అందులో సహ–వారసునిగా హక్కు లభించిందని అతను వాదించాడు. చెన్నై సిటీ సివిల్ కోర్టు మొదట అతనికి అనుకూలంగా ప్రాథమిక డిక్రీని జారీ చేసింది. కొనుగోలుదారులు అప్పీలు చేయగా మొదటి అప్పీలు కోర్టు ఆ డిక్రీని రద్దు చేసింది. మద్రాసు హైకోర్టు ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ తన తండ్రికి కేటాయించిన ఆస్తిపై అప్పీలుదారునికి జన్మతః ఎటువంటి హక్కులేదని తీర్పు ఇచ్చింది. హిందూ వారసత్వ(తమిళనాడు సవరణ) చట్టం, 1989లోని సెక్షన్ 29ఏపై ఆధారపడుతూ సుప్రీంకోర్టులో అప్పీలుదారుడు వాదించాడు. అయితే ఈ అప్పీలును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది.

నోయిడా మెట్రో విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: నవంబర్ 11(మహా ప్రభ)



నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోయిడా సెక్టార్ 4 వరకు ఆక్వా లైన్ మెట్రో రైలు కారిడార్ విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.2,390 కోట్ల అంచనా వ్యయంతో 8.449 కి.మీ. పొడవున ఐదు ఎలివేటెడ్ స్టేషన్లను నిర్మించనున్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే నోయిడా, గ్రేటర్ నోయిడాల్లో మెట్రో రైలు నెట్‌వర్క్ మొత్తం 71.878 కి.మీ.కు చేరనున్నది.ఎరువుల సబ్సిడీకి 62 వేల కోట్లు రబీ సీజన్ 2026–27కు ఫాస్ఫేటిక్, పొటాసిక్ ఎరువులపై రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి 31 వరకు ఉండే రబీ సీజన్ కోసం పీ అండ్ కే ఎరువులపై సబ్సిడీ రేట్లను ఖరారు చేశామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల రేట్లు పెరిగాయన్నారు. 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350గానే కొనసాగుతుందని, రైతులకు ఇబ్బంది లేకుండా నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్, సల్ఫర్ లను గ్రేడ్లతో సహా సబ్సిడీ రేట్లకే అందిస్తామన్నారు.

రూ.3,230 కోట్లతో ఢిల్లీలో యుగే యుగీన్ మ్యూజియం

ఢిల్లీలోని నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ సముదాయాలను పునర్వినియోగంలోకి తీసుకొచ్చి యుగే యుగీన్ భారత్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. దీని కోసం రూ.3,230 కోట్లను కేటాయించడానికి ఆమోదం తెలిపింది. ప్రపంచంలోనే అత్యధిక ప్రదర్శన స్థలం కలిగిన మ్యూజియంగా దీన్ని తీర్చిదిద్దనున్నారు. సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ మ్యూజియం నిర్మించనున్నారు.

స్టాండప్ ఇండియా' గడువు ఐదేండ్ల పొడిగింపు

మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే స్టాండప్ ఇండియా పథకాన్ని మరో ఐదేండ్లు (2031 మార్చి 31 వరకు) కొనసాగించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. మరో 2.5 లక్షల మంది పారిశ్రామికవేత్తలకు ఐదేండ్లలో ఆర్థిక సాయం అందించడమే పథకం లక్ష్యమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పథకం ద్వారా 2.75 లక్షల మందికిపైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందాయని చెప్పారు.

నిషేధం ఉన్నప్పటికీ మహారాష్ట్ర,
మధ్యప్రదేశ్‌లో పాక్ విషపూరిత క్రీమ్ అమ్మకాలు

న్యూఢిల్లీ నవంబర్ 11(మహా ప్రభ)



భారత్, పాకిస్థాన్ మధ్య వాణిజ్య సంబంధాలు నిలిచిపోయాయి. అయినప్పటికీ పాక్‌కు చెందిన విషపూరిత ఫెయిర్‌నెస్ క్రీమ్ భారత మార్కెట్లను ముంచెత్తుతున్నది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాలలో ఈ క్రీమ్ అమ్మకాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఇది వాడిన పలువురు మహిళలు కిడ్నీ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారు. పాకిస్థాన్ తయారీ 'గోరీ బ్యూటీ క్రీమ్' భారత మార్కెట్లలో విపరీతంగా అమ్ముడవుతున్నది. రూ.380 నుంచి రూ.800 మధ్య ధర ఉన్న ఈ ఫెయిర్‌నెస్ క్రీమ్ అన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా అందుబాటులో ఉన్నది.కాగా, పాకిస్థాన్‌కు చెందిన ఈ ఫెయిర్‌నెస్ క్రీమ్‌లో పాదరసం, సీసం వంటి విషపూరిత లోహాలు ఉన్నట్లు ల్యాబ్ పరీక్షలో నిర్ధారణ అయ్యింది. ఒక పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) కంటే తక్కువగా ఉండాల్సిన పాదరసం ఈ క్రీమ్‌లో ఏకంగా 5,000 పీపీఎం ఉన్నది. పాదరసం, సీసం లోహాలు చర్మపు రంగుకు కారణమయ్యే వర్ణద్రవ్యం అయిన మెలనిన్ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తాయి. ఇది మెలనిన్ ఉత్పత్తిని నిరోధించడం వల్ల చర్మం లేత రంగులో కనిపిస్తుంది. ఈ క్రీమ్ వాడకం ఆపేసిన తర్వాత చర్మం దాని అసలు రంగులోకి తిరిగి వస్తుంది. మరోవైపు ఈ క్రీమ్‌ను పూసిన తర్వాత మొదట చర్మాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది. దీనివల్ల చర్మం ఎర్రగా మారి దురదగా అనిపిస్తుంది. ఎక్కువ కాలం వాడటం వల్ల చర్మం పలుచగా మారి రక్తనాళాలు కూడా కనిపిస్తాయి. పాదరసం, సీసం వంటి విషపూరితాలు చర్మంలోకి శోషించిన తర్వాత రక్తప్రవాహం ద్వారా మెదడు, నాడీ వ్యవస్థకు ప్రయాణిస్తాయి. న్యూరోటాక్సిన్‌లుగా (నరాల విషాలుగా) పనిచేస్తూ శరీరానికి కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయి. అలాగే శరీరం ఈ విషపదార్థాలను బయటకు పంపడానికి ప్రయత్నించినప్పుడు మూత్రపిండాలు, కాలేయంలో అవి పేరుకుపోతాయి. దీంతో కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి అంతర్గత అవయవాలకు తీవ్ర నష్టం కలుగుతుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో 18 మంది మహిళలు తీవ్రమైన మూత్రపిండాల వ్యాధికి గురైనట్లు డాక్టర్లు గుర్తించారు. ఆ మహిళలంతా ఈ క్రీమ్‌ను వాడినట్లు తెలుసుకున్నారు. ఆ క్రీమ్‌లో ఆందోళనకరమైన రీతిలో సీసం, పాదరసం ఉన్నట్లు ల్యాబ్ పరీక్షలు నిర్ధారించాయి. ఈ నేపథ్యంలో పాక్ తయారీ ఫెయిర్‌నెస్ క్రీమ్‌ను నిషేధించాలని డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని మార్కెట్లతో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో పాక్‌కు చెందిన ఈ ఫెయిర్‌నెస్ క్రీమ్ ఇప్పటికీ అందుబాటులో ఉన్నది. మహారాష్ట్రలోని అమరావతి, నాగ్‌పూర్ మీదుగా, ఖండ్వా, బుర్హాన్‌పూర్ ద్వారా మధ్యప్రదేశ్‌లోకి ఈ పాక్ క్రీమ్‌లు ప్రవేశిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చేరుతున్నట్లు గ్రహించారు. ఈ నేపథ్యంలో వాణిజ్య నిషేధం ఉన్నప్పటికీ పాకిస్థాన్ తయారీ ఫెయిర్‌నెస్ క్రీమ్ ఉత్పత్తులు ఏ ఏ మార్గాల ద్వారా దేశంలోకి ప్రవేశిస్తున్నాయి అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అంతర్జాతీయంగా కూడా న్యూజిల్యాండ్, ఫిలిప్పీన్స్‌లో పాక్ క్రీమ్‌ను కొన్నేళ్ల కిందటే నిషేధించారు.

ఏఐ విప్లవంతో క్యాన్సర్ ఇక గత చరిత్రే

-రానున్న పదేండ్లలో అల్జీమర్స్, గుండె జబ్బులకూ చికిత్సలు
-ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ కీలక వ్యాఖ్యలు
-పరిశోధనలు, పరీక్షలకు ప్రత్యామ్నాయం లేదన్న నిపుణులు

న్యూఢిల్లీ నవంబర్ 11(మహా ప్రభ)



కృత్రిమ మేధ (ఏఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండటం వల్ల వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడెయ్ చెప్పారు. రానున్న పదేండ్లలో క్యాన్సర్, అల్జీమర్స్, గుండె జబ్బులు, మానసిక అనారోగ్యం వంటి వ్యాధులు గత చరిత్రగా మారే అవకాశం ఉందన్నారు. ఏఐని సరైన రీతిలో వినియోగించుకోగలిగితే, వేల సంవత్సరాలుగా మానవాళిని వేధిస్తున్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనవచ్చునని తెలిపారు. క్లాడ్ ఏఐ చాట్‌బాట్‌ను రూపొందించినది ఆంథ్రోపిక్ సంస్థ అనే విషయం తెలిసిందే.ఇదిలావుండగా, ఏఐ సహాయంతో పదేండ్లలోనే అన్ని ప్రధాన వ్యాధులకు పరిష్కారాలు లభిస్తాయన్న అంచనాలపై ఔషధ పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వెర్టెక్స్ ఫార్మాస్యూటికల్స్ ఎగ్జిక్యూటివ్ వైర్మన్ జెఫ్ లీడెన్ మాట్లాడుతూ, దాదాపు 50 ఏఐ సంస్థల సాయంతో 10 వేల ఔషధ సమ్మేళనాలను పరిశీలించినప్పటికీ, వాటిలో ఏదీ స్వతంత్రంగా పని చేసే ఔషధాన్ని రూపొందించలేకపోయిందన్నారు. మరికొందరు ఔషధ రంగ నిపుణులు స్పందిస్తూ, ఒక ఔషధానికి ఉపయోగపడే అణువును ఏఐ గుర్తించినంత మాత్రాన అది మందుగా మారిపోదని చెప్పారు. ప్రయోగశాలల్లో పరీక్షలు, జంతువులపై అధ్యయనాలు, మానవులపై క్లినికల్ ట్రయల్స్, నియంత్రణ సంస్థల అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. సాధారణంగా ఒక ఔషధాన్ని అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి దాదాపు 12 ఏండ్లు పడుతుందని, ఈ ప్రక్రియలో ఎక్కువ సమయం పరీక్షలు, భద్రతా పరిశీలనలకే అవసరమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఏఐ నమూనాలకు జీవశాస్త్రంలోని సంక్లిష్ట కారణ–ఫలిత సంబంధాలను పూర్తి స్థాయిలో అర్థం చేసుకునే సామర్థ్యం లేదని సంజ్ఞాన శాస్త్రవేత్త గ్యారీ మార్కస్, కార్డియాలజిస్ట్ ఎరిక్ టోపోల్ వంటి నిపుణులు తెలిపారు. ఏఐ రూపొందించిన ఔషధం పూర్తి స్థాయిలో వైద్య వినియోగంలోకి వచ్చిన దాఖలాలు ఇప్పటి వరకు లేవు. కొత్త చికిత్సలు సమర్థవంతమైనవని నిరూపించడానికి పరిశోధనలు, పరీక్షలకు ప్రత్యామ్నాయం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

కశ్మీర్‌లో ఉగ్ర కాల్పులు..




జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. కుల్గాం జిల్లాలోని అఖ్రాన్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ భద్రతా సిబ్బందిపై బుధవారం మధ్యాహ్నం దాడి చేశారు. మిర్ బజార్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద జరిగిన ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాడి నేపథ్యంలో భద్రతా బలగాలు అప్రమత్తమై ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మోటార్‌సైకిళ్లపై వచ్చిన దుండగులు మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు. ఊహించని దాడితో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు ప్రారంభించారు. కాల్పుల ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడటంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న క్విక్ రియాక్షన్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాయపడిన జవాన్లను మెరుగైన చికిత్స కోసం అనంత్‌నాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు, కాల్పులు జరిపిన దుండగులు దాడి అనంతరం మోటార్‌సైకిళ్లపై అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో భద్రతా బలగాలు చెక్‌పోస్టు పరిసర ప్రాంతాలను చుట్టుముట్టి గాలింపు చేపట్టాయి. ఉగ్రవాదులు తప్పించుకునే అవకాశం లేకుండా పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ కొనసాగిస్తున్నారు. దాడికి పాల్పడిన వారి ఆచూకీ గుర్తించడంతో పాటు వారిని పట్టుకునేందుకు బలగాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఘటన నేపథ్యంలో కుల్గాం, అఖ్రాన్ పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. దుండగుల గుర్తింపు, వారి కదలికలపై భద్రతా సంస్థలు దృష్టి సారించాయి.

దీపావళికి టపాసులు కాలిస్తే తప్పేంటి?



న్యూఢిల్లీ:
దీపావళి వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా టపాసులు కాల్చడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఒక్క రోజు పండుగను ఆనందంగా జరుపుకొంటే కాలుష్యం పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఏంటని ప్రశ్నించారు. కాలుష్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అది కొంతకాలానికి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ధనత్రయోదశి, –దీపావళి సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడం సంతోషంగా ఉందని యోగి అన్నారు. అయోధ్యలో తాను కూడా దీపావళి వేడుకల్లో పాల్గొని బాణసంచా కాల్చినట్లు గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పండుగలపై ఆంక్షలు విధించడాన్ని ప్రోత్సహించలేదని, ప్రజలు స్వేచ్ఛగా వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటోందని చెప్పారు. వ్యవస్థ మొత్తాన్ని అవినీతి పనులతో కలుషితం చేసేవారిని ఎవరూ ప్రశ్నించరని, ప్రజలు ఒక్కరోజు టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటే మాత్రం వెంటనే కాలుష్యం అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ఇతరులు పండుగలు జరుపుకొంటూ ఆనందంగా ఉన్నప్పుడే కొందరికి కాలుష్యం గుర్తుకొస్తోందని వ్యాఖ్యానించారు. దీపావళికి ముందు దేశంలోని పలు నగరాల్లో గాలి నాణ్యత క్షీణించింది. ముఖ్యంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నవంబర్ 9న ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 371గా నమోదైంది. 2021 తర్వాత ఇదే అత్యంత అధ్వాన స్థాయి. పలు పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ 400 దాటడంతో గాలి నాణ్యత తీవ్ర కేటగిరీలోకి వెళ్లింది. ప్రస్తుతం పరిస్థితి కొంత మెరుగుపడి 'పూర్' స్థాయికి చేరింది.

అంతరిక్షంలో చైనా అద్భుతం..



అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. తమ తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో పనిచేస్తున్న చైనా శాస్త్రవేత్తలు, ఇప్పటివరకు ప్రపంచంలో ఎవరూ సాధించని అత్యంత శీతల ఉష్ణోగ్రతను సృష్టించి రికార్డు నెలకొల్పారు. ఈ ప్రయోగంలో 9.7 పికోకెల్విన్ల ఉష్ణోగ్రతను నమోదు చేసినట్లు వారు ప్రకటించారు. ఈ ఫలితాల వివరాలను ప్రతిష్ఠాత్మక 'సైన్స్' జర్నల్‌లో ప్రచురించారు.పెకింగ్ యూనివర్సిటీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం ఈ అసాధారణ ప్రయోగాన్ని నిర్వహించింది. ఇందుకోసం వారు సుమారు 20,000 రుబీడియం-87 అణువులతో కూడిన బోస్-ఐన్‌స్టీన్ కండెన్‌సేట్‌ను ఉపయోగించారు. అంతరిక్ష కేంద్రంలోని మైక్రోగ్రావిటీ (సూక్ష్మ గురుత్వాకర్షణ) వాతావరణంలో ఈ అణువులను లేజర్ ట్రాప్‌లు, ఇతర శీతలీకరణ పద్ధతుల ద్వారా అత్యంత చల్లగా మార్చారు. అనంతరం ఆ అణువుల సమూహాన్ని ఏడు సెకన్ల పాటు పరిశీలించి, దాని విస్తరణ వేగాన్ని బట్టి ఉష్ణోగ్రతను లెక్కించారు. ఈ ఉష్ణోగ్రత 9.7 పికోకెల్విన్లు (0.0000000000097 కెల్విన్లు)గా తేలింది. ఈ ఉష్ణోగ్రత ఎంత తక్కువంటే, విశ్వం సగటు ఉష్ణోగ్రత అయిన 2.7 కెల్విన్లతో పోలిస్తే ఇది దాదాపు 280 బిలియన్ రెట్లు చల్లనిది. ఇంతకుముందు 2021లో జర్మనీలో ఫ్రీ-ఫాల్ ప్రయోగంలో 38 పికోకెల్విన్ల ఉష్ణోగ్రతను నమోదు చేయగా, ఇప్పుడు డ్రాగన్ కంట్రీ ఆ రికార్డును బద్దలుకొట్టింది. భూమిపై గురుత్వాకర్షణ కారణంగా ఇలాంటి ప్రయోగాలు చేయడం చాలా కష్టం. అణువులు వేగంగా కిందకు పడిపోవడంతో వాటిని ఎక్కువసేపు పరిశీలించడం సాధ్యం కాదు. కానీ, అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ వాతావరణం ఈ సమస్యను అధిగమించేందుకు వీలు కల్పించింది. అతి శీతల పదార్థాలను నియంత్రించడంలో తాము సాధించిన పురోగతికి ఈ ప్రయోగం నిదర్శనమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ విజయం భవిష్యత్తులో మరింత కచ్చితమైన క్వాంటం సెన్సార్ల తయారీకి, అంతరిక్షంలో ప్రాథమిక భౌతిక శాస్త్ర అధ్యయనాలకు మార్గం సుగమం చేస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు.

కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు మూసివేత

– ఈ ఏడాది 19.20 లక్షలకు పైగా భక్తుల దర్శనం
–మంత్రోచ్ఛారణలు, సైనిక బ్యాండ్ మధ్య కార్యక్రమం

కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్)
హిమాలయాల్లోని ప్రముఖ శైవ క్షేత్రం కేదార్‌నాథ్ ఆలయాన్ని శీతాకాలం సందర్భంగా బుధవారం ఉదయం 8.30 గంటలకు సంప్రదాయబద్ధంగా మూసివేశారు. ఈ ఏడాది యాత్రా సీజన్‌లో దేశ, విదేశాల నుంచి 19.20 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు బదరీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) అధ్యక్షుడు హేమంత్ ద్వివేది వెల్లడించారు. ఆలయ మూసివేత కార్యక్రమం సంప్రదాయ పూజలు, వేద మంత్రోచ్ఛారణలు, సైనిక బ్యాండ్ సంగీతం మధ్య వైభవంగా నిర్వహించారు. శీతాకాల విరామానికి ముందు స్వామివారిని చివరిసారిగా దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. శీతాకాలంలో కేదార్‌నాథ్‌లో పూజలు నిలిచిపోనున్న నేపథ్యంలో స్వామివారి ఉత్సవమూర్తి పల్లకీని ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర్ ఆలయానికి తరలించనున్నారు. అక్కడే శీతాకాలమంతా బాబా కేదార్‌కు నిత్యపూజలు నిర్వహిస్తారు. కేదార్‌నాథ్‌ను దర్శించుకోలేకపోయిన భక్తులు ఉఖీమఠ్‌లో స్వామివారిని దర్శించుకోవాలని హేమంత్ ద్వివేది విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న ఆలయ దర్శనం మొదలైంది. కాగా, వచ్చే ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా ఆలయాన్ని తిరిగి తెరిచే అవకాశం ఉంది

మద్యం అమ్మకాల్లో భారత్ జోరు!

–అమెరికా, చైనాలను మించి భారత మార్కెట్‌లో భారీ వృద్ధి
–ప్రపంచవ్యాప్తంగా తగ్గిన మద్యం వినియోగం
–భారత్‌లో మాత్రం 10 శాతం పెరిగిన అమ్మకాలు
–21 ప్రధాన మార్కెట్లలో అత్యధిక వృద్ధి నమోదు
–బీర్ విక్రయాల్లో 16 శాతం వృద్ధి
–రెడీ టు డ్రింక్ పానీయాల అమ్మకాలు 12 శాతం పెరుగుదల
–ఇండియన్ విస్కీకి నాలుగు శాతం, బ్లెండెడ్ స్కాచ్‌కు ఎనిమిది శాతం వృద్ధి



ప్రపంచవ్యాప్తంగా మద్యం వినియోగం తగ్గుముఖం పడుతుండగా, భారత్‌లో మాత్రం అమ్మకాలు దూసుకుపోతున్నాయి. అమెరికా, చైనా వంటి అతిపెద్ద మార్కెట్లలో విక్రయాలు క్షీణించినా.. భారత మార్కెట్‌లో మాత్రం అన్ని ప్రధాన కేటగిరీల్లోనూ వృద్ధి నమోదవుతోంది. 2026 తొలి ఆరు నెలల గణాంకాలు ఈ మార్పును స్పష్టం చేస్తున్నాయి. ఐడబ్ల్యూఎస్ సర్వే ప్రకారం.. ప్రపంచ మద్యం వినియోగంలో 76 శాతం వాటా కలిగిన 21 ప్రధాన మార్కెట్లలో మొత్తం వినియోగం ఒక శాతం తగ్గింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆల్కహాల్ మార్కెట్ అయిన అమెరికాలో అమ్మకాలు నాలుగు శాతం, చైనాలో మూడు శాతం పడిపోయాయి. అదే సమయంలో భారత్‌లో మాత్రం మద్యం వినియోగం 10 శాతం పెరిగింది. సర్వే పరిధిలోని 21 మార్కెట్లలో ఇదే అత్యధిక వృద్ధి కావడం విశేషం. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు మందగించడంతో గ్లోబల్ మద్యం కంపెనీలు భారత్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. భారీ వినియోగదారుల సంఖ్య, మారుతున్న అభిరుచులు, కొత్త ఉత్పత్తులపై పెరుగుతున్న ఆసక్తి భారత మార్కెట్‌కు ప్రాధాన్యాన్ని పెంచుతున్నాయి. దీంతో అంతర్జాతీయ కంపెనీలకు భారత్ కీలక వ్యాపార కేంద్రంగా మారుతోంది. దేశీయంగా దాదాపు అన్ని మద్యం కేటగిరీల్లోనూ అమ్మకాలు పెరిగాయి. జనవరి నుంచి జూన్ మధ్య బీర్ వినియోగం 16 శాతం వృద్ధి సాధించగా, రెడీ టు డ్రింక్ ఆల్కహాలిక్ పానీయాల విక్రయాలు 12 శాతం పెరిగాయి. భారత్‌లో అధికంగా వినియోగించే ఇండియన్ విస్కీ నాలుగు శాతం, బ్లెండెడ్ స్కాచ్ విస్కీ ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేశాయి. వోడ్కా, జిన్ అమ్మకాలు చెరో ఆరు శాతం పెరగ్గా, రమ్, నాన్‌కాన్యాక్ బ్రాందీ విక్రయాల్లో మూడు శాతం వృద్ధి కనిపించింది. వైన్ అమ్మకాలు కూడా సానుకూలంగా సాగాయి. ఇక ఆల్కహాల్ లేని నాన్‌అల్కహాలిక్ బీర్ విక్రయాలు భారత్‌లో ఏకంగా 25 శాతం పెరిగాయి. అన్ని కేటగిరీలతో పోలిస్తే ఇదే అత్యధిక వృద్ధి. ప్రపంచవ్యాప్తంగా ఈ విభాగం అమ్మకాలు ఎనిమిది శాతం మాత్రమే పెరిగాయి. ఆరోగ్యంపై అవగాహన పెరగడం, మద్యానికి ప్రత్యామ్నాయ పానీయాలపై ఆసక్తి చూపడం ఈ విభాగం వృద్ధికి కారణాలుగా మార్కెట్ ధోరణులు సూచిస్తున్నాయి.

ఐపీఎల్‌లో మరో రెండు జట్లు?

న్యూఢిల్లీ:
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరోసారి జట్ల సంఖ్య పెరగనుందా? ప్రస్తుతం పది జట్లతో కొనసాగుతున్న ఈ మెగా క్రికెట్ లీగ్‌ను 12 జట్లకు విస్తరించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2028 సీజన్ నుంచి మరో రెండు ఫ్రాంచైజీలు పోటీలోకి వచ్చే అవకాశముందని క్రీడా వర్గాల్లో చర్చ నడుస్తోంది. కొత్త జట్లకు పుణే, వడోదర నగరాలు కేంద్రాలుగా మారవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై బీసీసీఐ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. 2008లో ఎనిమిది జట్లతో ప్రారంభమైన ఐపీఎల్ ప్రయాణం అనతికాలంలోనే ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ కలిగిన లీగ్‌లలో ఒకటిగా ఎదిగింది. ఆటతో పాటు వినోదం, భారీ వ్యాపార లావాదేవీలకు వేదికగా మారింది. ఆటగాళ్ల వేలం, ఫ్రాంచైజీల పెట్టుబడులు, ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లతో బీసీసీఐకి భారీ ఆదాయాన్ని సమకూరుస్తోంది. 2022లో గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు చేరడంతో ఫ్రాంచైజీల సంఖ్య ఎనిమిది నుంచి పదికి పెరిగింది. అప్పటి నుంచి ఇదే సంఖ్య కొనసాగుతోంది. ఇప్పుడు మరో రెండు జట్లను చేర్చడం ద్వారా లీగ్ పరిధిని మరింత విస్తరించాలనే ఆలోచన ఉన్నట్లు సమాచారం. పుణే, వడోదర నగరాల పేర్లు కొత్త ఫ్రాంచైజీల విషయంలో ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లోనూ క్రికెట్‌కు మంచి ఆదరణ ఉండటంతో కొత్త జట్లకు అభిమానుల మద్దతు లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఫ్రాంచైజీలు ఏర్పాటైతే స్థానిక క్రికెట్ అభివృద్ధికి, యువ ఆటగాళ్లకు అవకాశాలు పెరగడంతో పాటు ఆయా నగరాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా విస్తరించే వీలుంటుంది. అయితే కొత్త జట్లకు సంబంధించిన ఎంపిక విధానం, ఫ్రాంచైజీ హక్కుల వేలం, పెట్టుబడుల వివరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఐపీఎల్ జట్ల సంఖ్య 12కు పెరిగితే టోర్నీలో మ్యాచ్‌ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం మరింత విస్తరించవచ్చు. ముఖ్యంగా 2028–2032 మధ్య కాలానికి సంబంధించిన మీడియా హక్కుల ఒప్పందాల నేపథ్యంలో ఈ విస్తరణకు ప్రాధాన్యం ఏర్పడినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మ్యాచ్‌లు పెరిగితే ప్రసార సంస్థలకు మరింత కంటెంట్ అందుబాటులోకి రావడంతో పాటు బీసీసీఐ ఆదాయ మార్గాలు కూడా పెరిగే అవకాశముంది. మరోవైపు జట్ల సంఖ్య పెరగడం వల్ల నిర్వహణపరమైన సవాళ్లు కూడా ఎదురుకావచ్చు. ఇప్పటికే సుమారు రెండు నెలలపాటు సాగే ఐపీఎల్‌లో మ్యాచ్‌లు మరింత పెరిగితే షెడ్యూల్ రూపకల్పన, ఆటగాళ్ల విశ్రాంతి, ప్రయాణాలు కీలకంగా మారతాయి. ముఖ్యంగా అంతర్జాతీయ క్రికెట్ ఆడే ఆటగాళ్లపై పనిభారం పెరగడంతో పాటు గాయాల ముప్పు కూడా ఉండవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఫ్రాంచైజీలు తమ ఆటగాళ్లను సమర్థంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. కొత్త జట్లు వస్తే దేశీయ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు లభించవచ్చని భావిస్తున్నారు. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను గుర్తించి జట్టులోకి తీసుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీపడే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్‌లో జట్ల విస్తరణకు సంబంధించి అధికారిక నిర్ణయం, అమలు ప్రణాళికపై స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు 2028 నుంచి పుణే, వడోదర కేంద్రాలుగా కొత్త జట్లు ప్రవేశిస్తాయన్న ప్రచారాన్ని ఊహాగానంగానే చూడాల్సి ఉంటుంది.

వచ్చే ఏడాది నుంచి 10+2 విద్యా విధానం

(మొదటి తరువాయి)

సెకండరీ విద్య కొనసాగించాలని సూచించారు. 12వ తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులకు భాషా, సమాచార నైపుణ్యాలపై పూర్తి పట్టు ఉండాలని అన్నారు. ఆ తర్వాత తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును ఎంచుకొని అందులో నిపుణులుగా ఎదిగే అవకాశం కల్పించాలని తెలిపారు. పదో తరగతి తర్వాత చదువు మానేస్తున్న వారిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలే అధికంగా ఉంటున్నారని సీఎం పేర్కొన్నారు. 12వ తరగతి వరకు విద్య కొనసాగించే కేంద్రీయ, నవోదయ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో డ్రాపౌట్లు తక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఇప్పటికే 12వ తరగతి వరకు విద్యా విధానం అమలవుతోందని తెలిపారు. జూనియర్ కళాశాలల లెక్చరర్లు, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ, పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. అవసరమైన చోట పూర్తి సౌకర్యాలతో సొంత భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించాలని, ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న పాఠశాలల పనుల పురోగతిపై సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా నిర్మాణాలు చేపట్టాల్సిన చోట ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అప్‌గ్రేడ్ చేసిన తర్వాత విద్యార్థుల నమోదు పెరిగిందని, శిక్షణ పొందిన వారందరికీ ఉద్యోగాలు లభించాయని సీఎం తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు అవసరమైన నిధుల విడుదలను వేగవంతం చేయాలని ఆదేశించారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్, ఇతర ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నియామకాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఉన్నత విద్యామండలి ఛైర్మన్, యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి.సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనకు గ్రీన్‌సిగ్నల్

(మొదటి తరువాయి)

హైటెక్ సిటీ ప్రాంతంలోని తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని చెరువులను ఆక్రమణల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన నిర్ణయం వెనుక ఎలాంటి స్వార్థం లేదని, భవిష్యత్తు తరాలకు మేలు చేయాలన్నదే తన ఆకాంక్షని పేర్కొన్నారు. తమ్మిడికుంట చెరువు విస్తీర్ణాన్ని 14 ఎకరాల నుంచి 30 ఎకరాలకు పెంచి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇందుకు రెండు ఎకరాల భూమిని అందించిన సినీనటుడు అక్కినేని నాగార్జునను అభినందించారు. సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలోనూ ఆయన హీరోగా నిలిచారని కొనియాడారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో 1,372 చెరువులు ఉండేవని, వివిధ కారణాలతో వాటిలో సగం కనుమరుగయ్యాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆక్రమణలు, వలసలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇందుకు కారణమయ్యాయని చెప్పారు. తమ్మిడికుంటతో పాటు బతుకమ్మకుంట, బుమ్-రుక్నుద్దౌలా, సున్నం చెరువు, నల్లచెరువు, ఫాక్స్ సాగర్, మియాపూర్ చెరువు సహా దాదాపు 20 చెరువులను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. చెరువులు, నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమించడం వల్ల వర్షాల సమయంలో రోడ్లు జలమయమై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. 1908లో వచ్చిన భారీ వరదల తర్వాత నిజాం ప్రభుత్వం ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించిందని సీఎం గుర్తుచేశారు. వందేళ్ల తర్వాత కూడా అవి నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని తెలిపారు. నిజాం కాలంలో మూసీ పరివాహక ప్రాంతంలో పురానాపూల్ బ్రిడ్జి, సిటీ కాలేజీ, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి వంటి చారిత్రక కట్టడాలు నిర్మించారని చెప్పారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మూసీ కాలుష్య కూపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు తీవ్ర సమస్యగా మారిందని సీఎం అన్నారు. ఫ్లోరైడ్ సమస్యతో పాటు నది కాలుష్యంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాను స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు. మూసీ ప్రక్షాళన కేవలం సుందరీకరణ కార్యక్రమం కాదని, ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తుతో ముడిపడిన అంశమని స్పష్టం చేశారు. సబర్మతీ, గంగా, యమునా నదుల పరివాహక ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, నదుల అభివృద్ధితో ఆర్థిక కార్యకలాపాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనలో ఎవరికీ నష్టం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బాధితులుంటే నూటికి నూరు శాతం ఆదుకుంటామని తెలిపారు.

అమూల్, మదర్ డెయిరీ పాల ధరల పెంపు

లీటరుపై రూ.2-4 వరకు పెంచిన సంస్థలు
రైతుల నుంచి కొనుగోలు ధరలు పెరగడమే ప్రధాన కారణం

న్యూఢిల్లీ:
అమూల్, మదర్ డెయిరీ సంస్థలు పాల ధరలను లీటరుకు రూ.2 నుంచి రూ.4 వరకు పెంచాయి. రైతుల నుంచి కొంటున్న పాల రేట్లు పెరగడం, నిర్వహణ, ప్రాసెసింగ్ ఖర్చులు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. అమూల్ డెయిరీ '3 శాతం పాల కొవ్వు ఉన్న టోన్డ్ పాల ధరను లీటరుపై రూ.2, 6 శాతం పాల కొవ్వు ఉన్న పాల ధరను రూ.4 పెంచింది. రోజూ మార్కెట్ లో అమ్మే తాజా పాల ప్యాకెట్లపై 4 నుంచి 6 శాతం ధరలను పెంచుతున్నట్లు వెల్లడించింది.ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అతిపెద్ద పాల సరఫరా సంస్థ అయిన మదర్ డెయిరీ బల్క్‌గా అమ్మే టోన్డ్ పాలు లీటరుపై రూ.58 నుంచి రూ.60కి పెంచింది. ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరు ధరను రూ.72 నుంచి రూ.76కి, ప్యాకెట్లలో అమ్మే టోన్డ్ మిల్క్ లీటరు ధర రూ.60 నుంచి రూ.62కు పెంచింది. డబుల్ టోన్డ్ మిల్క్ లీటరు ధర రూ.54 నుంచి రూ.56కు చేరింది. ఆవు పాల ధరను లీటరుకు రూ.62 నుంచి రూ.65కు పెంచుతున్నట్లు మదర్ డెయిరీ వెల్లడించింది. ఈ రెండు సంస్థలు మే నెలలో ధరలను సవరించాయి. ఆరు నెలల్లోనే మరోసారి పెంచాయి.

భారత్ సమ్మిట్‌కు సహకరించాలి

(మొదటి తరువాయి)

చెందిన పలువురు ప్రతినిధులు హాజరై విజయవంతం చేశారని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. ఆ సదస్సులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు పలువురు జాతీయ నాయకులు, వివిధ పార్టీల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు పాల్గొన్నారని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించనున్న భారత్ సమ్మిట్--2కు సుమారు 70 దేశాల నుంచి అంతర్జాతీయ నాయకులు, ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు ప్రపంచస్థాయిలో గుర్తింపు లభించడంతో పాటు కీలక అంశాలపై విస్తృత చర్చలకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతో సమ్మిట్‌ను విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేసీఆర్ హయాంలో రైతే రాజు

(మొదటి తరువాయి)

బహిరంగ సభలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. కాళేశ్వరం నీటిని వినియోగించకుండా సముద్రంలోకి వదిలేస్తూ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు రావాల్సిన 90 టీఎంసీల నీటిని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిలిపివేసిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై మూడేళ్లుగా శ్రద్ధ చూపకుండా, తుమ్మిడిహెట్టి పేరుతో కొత్త ప్రతిపాదనలు తెరపైకి తెస్తోందని అన్నారు. కరువు పరిస్థితుల్లోనూ మేడిగడ్డ వద్ద ప్రతిరోజూ సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు, అంటే దాదాపు రెండు టీఎంసీలు, దిగువకు వృథాగా వెళ్తున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతాంగ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. ఆనాడు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, సరిపడా సాగునీరు అందుబాటులో ఉండటంతో రైతులు పంటలు సాగు చేసుకునేవారని గ

దేవరకొండను జిల్లాగా ప్రకటించాలి

-మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోయిని చంద్రమౌళి



దేవరకొండ నవంబర్ 11(మహా ప్రభ)
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో చారిత్రక నేపథ్యం కలిగిన దేవరకొండ ఖిల్లా ను తప్పకుండా జిల్లాగా ప్రకటించాలని దేవరకొండ మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోయిని చంద్రమౌళి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ఉమ్మడి పది జిల్లాలతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2016 సంవత్సరంలో ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం మొదటి దశలో 31 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ సందర్భంలో ఆనాటి ప్రభుత్వానికి దేవరకొండ నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు అనేకసార్లు దేవరకొండ ఖిల్లా ను జిల్లాగా ప్రకటించాలని ఆనాటి ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించిన పట్టించుకోలేదన్నారు.మరల2019 సంవత్సరంలో రెండవసారి జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తున్న సందర్భంలో అప్పుడు కూడా గత బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి దేవరకొండ నియోజకవర్గ ప్రజలు తరపున ప్రజా ప్రతినిధులు, నాయకులు, వినతి పత్రాలు సమర్పించిన పెడ చెవిన పెట్టిందన్నారు ఆనాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాలక్కీ నెంబర్ 6 అని 33 జిల్లాలుగా ప్రకటించారు. ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేవరకొండ నియోజకవర్గం ప్రజల యొక్క కోరికను పరిపాలన సౌలభ్యం కోసం దేవరకొండ జిల్లాగా ప్రకటించాలని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేవరకొండ నియోజకవర్గం ప్రజలు నల్లగొండ జిల్లాకు వెళ్లాలంటే చివరి గుండ్లపల్లి (డిండి) మండలం ప్రజలు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆఫీస్ కు గానీ, ఇతర కార్యాలయాలకు వెళ్లాలన్నా సుమారు 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అదే విధంగా చందంపేట మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి వంటి సుదూర ప్రాంతాల ప్రజలు నల్లగొండకు వెళ్లాలంటే సుమారుగా 120 కిలోమీటర్లు ప్రయాణించాలి తీవ్ర వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అక్కడికి వెళ్లిన అక్కడ అధికారులు ఉంటారో లేదో తెలియని పరిస్థితుల్లో అనేకసార్లు తమ యొక్క అవసరాల నిమిత్తం వెళ్ళవలసి వస్తుందని ప్రజలు అంటున్నారు.సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్త ఫీచర్స్ సిటీ, మహేశ్వరం,కల్వకుర్తి,దేవరకొండ, మిగతా కొన్ని ప్రాంతాలను కలుపుకొని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలన్న నేపథ్యంలో చారిత్రక నేపథ్యం కలిగిన దేవరకొండ ఖిల్లా ను జిల్లాగా ప్రకటించాలని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రచారాన్ని దేవరకొండ నియోజకవర్గ ప్రజలు చారిత్రక నేపథ్యం కలిగిన దేవరకొండ కిల్లాను వేరే ప్రాంతంలో కలపకుండా కొత్త జిల్లాల ప్రతిపాదనలో దేవరకొండను కూడా ఒక కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ప్రజలు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారని దేవరకొండ నియోజకవర్గం మాల మహానాడు అధ్యక్షులు బోయిని చంద్రమౌళి అన్నారు దేవరకొండ
జిల్లాగా ప్రకటించడానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు.
భౌగోళికంగా అర్హతలు: దక్షిణాన: నక్కలగండి ప్రాజెక్టు
తూర్పున పుట్టంగండి ప్రాజెక్టు
పడమర డిండి ప్రాజెక్టు
ఉత్తరాన: గొట్టిముక్కల రిజర్వాయర్
నాలుగు దిక్కులా ప్రాజెక్టులతో, పక్కనే ఉన్న నల్లమల అటవీ ప్రాంతం అటవీ సంపదతో కూడిన ఈ ప్రాంతం భౌగోళికంగా జిల్లాగా ప్రకటించడానికి అన్ని అర్హతలు కలిగి ఉందన్నారు.
చారిత్రకంగా రేచర్ల రాజుల కాలం నాటి దేవరకొండ కోట ఎంతో ప్రసిద్ధి చెందిందని, ఈ ప్రాంతానికి 700 ఏళ్ల చరిత్ర ఉందన్నారు.
కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో ప్రజల మనోభావాలను గౌరవించి, పరిపాలనా సౌలభ్యం కోసం దేవరకొండను జిల్లాగా ప్రకటించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇది దేవరకొండ నియోజకవర్గంలోని 8 మండలాల ప్రజల చిరకాల కోరిక అని అన్నారు. దేవరకొండ నియోజకవర్గ మాల మానాడు అధ్యక్షులు బోయిని చంద్రమౌళి తెలిపారు

ఎమ్మెల్సీ పదవి వడ్డెర కులానికి కేటాయించాలి

నియోజకవర్గ అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ



దేవరకొండ నవంబర్ 11(మహా ప్రభ)
బుధవారం ప్రస్తుతం కాళీ అయిన గవర్నర్ కోట కింద వడ్డెర సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని నల్లగొండ జిల్లా దేవరకొండ వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ డిమాండ్ చేశారు .తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో తమ శ్రమను దారపోస్తు వడ్డెర సామాజిక వర్గానికి తగిన గుర్తింపు లేకపోవడంతో ఇప్పుడు సరైన సమయం వచ్చినందున గవర్నర్ కోటకిండా ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ పదవి వడ్డెర సామాజిక వర్గానికి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.వడ్డెర కులం వారు తాత ముత్తాతల నుండి తరతరాలుగా రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్న వడ్డెర కులం ప్రాజెక్టు లు నిర్మించేదే వడ్డెర కులం వారు తమ వ్యక్తిని నమ్ముకుని జీవనం సాగిస్తూ భార్యా పిల్లలతో అడవుల్లో పూరి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు మా వడ్డెర కులాన్ని రాజకీయ నాయకులు వాడుకుంటున్నారు తప్ప సరి అయిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలా బాధాకరం రాజకీయంగా అన్ని కులాలకు ఇచ్చినట్టే వడ్డెర కులానికి కూడా శాసనమండలిలో ఎమ్మెల్సీ స్థానం కల్పిస్తారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మరియు వడ్డెర స్థితిగతుల గురించి పూర్తిగా తెలిసిన ప్రతి నియోజకవర్గ ఎమ్మెల్యేలు మా యొక్క కోరికని మన్నించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని దేవరకొండ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ కోరారు.

15న నల్గొండలో జరిగే రైతు బహిరంగ సభ ను జయప్రదం చేయండి

దేవరకొండ నవంబర్ 11 (మహాప్రభ)
దేవరకొండ :నల్లగొండలోని ఎన్జి కళాశాల ప్రాంగణంలో ఈ నెల 15న జరిగే అఖిల భారత కిసాన్ సభ మహాప్రదర్శన,బహిరంగ సభకు రైతులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని,15 నుంచి 18 వరకు జరిగే 36వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం స్థానిక టీటీడీ కళ్యాణమండపంలో సిపిఎం దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య అధ్యక్షతనజరిగిన ఈ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ...15న జరిగే బహిరంగ సభకు మాజీ ఎంపి బృందాకరత్, ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ దావలే, ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, పలువురు రైతు సంఘాల నేతలు హాజరవుతారని తెలిపారు. బహిరంగ సభ సందర్భంగా నల్లగొండలో మహాప్రదర్శన నిర్వహిస్తున్నామని, అందులో రెడ్‌షర్టు వలంటీర్ల కవాతు, సాంస్కృతిక బృందాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.15వ తేదీ సాయంత్రం నుంచి 18 వరకు ప్రతినిధుల సభ



జరుగుతుందని చెప్పారు. 14న ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి 200 స్టాల్లతో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు.మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని తెలిపారు.రైతు అన్ని రకాలుగా నష్టపోతుంటే వారికి సబ్సిడీలు, రాయితీలు ఇవ్వాల్సింది పోయి కార్పోరేట్లకు ఊడిగం చేస్తున్నారని దీనితో ఉత్పత్తి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు రక్షణ దేశ రక్షణ అని అందుకోసం రైతు సంఘం పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనందు,కంభంపాటి శంకర్,వుడుగుండ్ల రాములు, నాగంటి నాగరాజు,కావాలి కృష్ణయ,బిజిలి లింగయ్య, పెరిక విజయ్ కుమార్,నల్ల శీను,బుడిగ వెంకటేష్, ఎండి రహీమ్, అంకురి శ్రీకాంత్, సభావాత్ వినోద్, ఏన్నపోతుల పరమేష్,తరమ్మా, ముత్తమ్మ,తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

-ప్రారంభించిన బి.ఆర్.ఎస్. పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్



దేవరకొండ నవంబర్ 11(మహాప్రభ)
బుధవారం దేవరకొండ బి.ఆర్.ఎస్.నియోజకవర్గం పార్టీ నాయకులు వడ్త్య రమేష్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం యశోద హాస్పిటల్ మరియు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణం లో గవర్నమెంట్ జూనియర్ బాయ్స్ కాలేజీ లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన బి.ఆర్ ఎస్.దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ గాజుల ఉష రాణి, అధ్యక్షులు వనం మణిమ్మ ,సెక్రెటరీ సింగి శెట్టి జ్యోత్స్న , ట్రెజరర్ పానుగంటి రాధ ,గాజుల రాజేష్ ,వనం భిక్షమయ్య , బి.ఆర్.ఎస్.పార్టీ నాయకులు రాఘవ చారి ,రామకృష్ణ ,సత్యం, నరేందర్ ,నరసింహ నాయక్ ,బాబా ,చిత్రం యేసేపు, లక్ష్మణ్, బాబా ,విజయ్, కోటేష్, బీమా నాయక్, జాగ్రూ బావోజీ, అరుణ్ నాయక్, రజినీ కాంత్,తదితరులు పాల్గొన్నారు....

అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించిన దాత కుటుంబాలకు ఎమ్మెల్యే బాలు నాయక్ కృతజ్ఞతలు



దేవరకొండ నవంబర్ 11 (మహాప్రభ)
దేవరకొండ: పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప మాలధారణ ప్రారంభ మహోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.అదేవిధంగా, ఆలయంలో అన్నప్రసాద వితరణకు అవసరమైన స్టీల్ టేబుల్స్, స్టీల్ బెంచీలు, అన్నప్రసాదం వడ్డించేందుకు స్టీల్ ట్రాలీలను రూ.12,12,111 విలువతో బహుకరించిన కీర్తిశేషులు గార్లపాటి వాచస్పతి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు గార్లపాటి ఎల్లయ్య, అరుణకుమారి కు ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. స్వామివారి సేవలో భాగంగా అన్నప్రసాద వితరణకు అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నరసింహ, లోకసాని శ్రీధర్ రెడ్డి, వడ్త్యా దేవేందర్ నాయక్, నక్క వెంకటేష్, శిరందాసు కృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు, వాంకునావత్ బిక్కు నాయక్, కొండూరు పవన్ కుమార్, అంగిరేకుల నాగభూషణం, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గడ్డం వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ నుండి శబరిమల శ్రీ స్వామి దేవస్థానికి ప్రత్యేక బస్సులు.

దేవరకొండ డివిజన్ నవంబర్ 11 (మహాప్రభ)
దేవరకొండ ఆర్టిసి డిపో ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని శబరిమల శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయ్యప్పస్వామిమాలధారణ స్వాములు, భక్తుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బుక్చేసుకున్న బస్సులో గురుస్వామి, ఇద్దరు మణికంఠలు,ఇద్దరు వంట మనుషులు, ఒక లగేజ్ అటెండెంట్ లకు ఉచితం అని తెలిపారు. డిపో పరిధిలోని స్వాములు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు.దేవరకొండ.డిపో కార్యాలయం,మరియు 9848847419 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.



కాచారం గ్రామనికి బీటి (డాంబర్) రోడ్డు పనులు ప్రారంభం

దేవరకొండ నవంబర్ 11(మహా ప్రభ)
ఎన్నో ఏళ్లుగా మా కాచారం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న బీటీ (డాంబర్) రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఎంతో ఆనందకరమైన విషయం.



గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేరుస్తూ, గ్రామానికి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ చూపిన దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ కి కాచారం గ్రామ ప్రజల తరఫున, గ్రామ సర్పంచ్ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న మీ నాయకత్వం అభినందనీయం. బీటీ రోడ్డు మా గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండటమే కాకుండా, రాకపోకలకు సౌకర్యవంతంగా మారనుంది గ్రామ ప్రజలందరూ సంతోషాన్ని తెలియజేశారు

ప్రతి సర్వేలో రవీంద్ర కుమార్ పేరు మార్మోగుతోంది

-దేవరకొండ నియోజకవర్గంలో రవీంద్ర కుమార్ గెలుపు

దేవరకొండ నవంబర్ 11 (మహాప్రభ)
దేవరకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ రాజకీయ ప్రాధాన్యతపై చర్చ కొనసాగుతోంది. వివిధ సర్వేల్లో రవీంద్ర కుమార్‌కు ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది.గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలతో ఉన్న అనుబంధం, నియోజకవర్గ సమస్యలపై నిరంతరం స్పందించడం ఆయనకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.రానున్న ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గం నుంచి మరోసారి రమావత్ రవీంద్ర కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారనే ధీమాను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఎన్ 9 భక్తి టీవీ పూజా కార్యక్రమంలో పాల్గొన్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి.

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకం..

మెదక్ జిల్లా -11నవంబర్ (మహాప్రభ).
మెదక్ పట్టణంలోని ఆర్ఎన్ 9 భక్తి టీవీ స్టూడియోలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆర్ఎన్ 9 భక్తి టీవీ



నిర్వాహకులు దేశాయిపేట నాగరాజు శర్మను అభినందించారు. ఈ సందర్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజ అభివృద్ధిలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మీడియా రంగం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా తనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.
ఆర్ఎన్ 9 భక్తి టీవీ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు నిష్పక్షపాత వార్తా సమాచారాన్ని అందిస్తూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దేశాయిపేట నాగరాజు శర్మకు, టీవీ బృంద సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ కసిరెడ్డి. మాణిక్య రెడ్డి, నాయకులు గంజి. నవీన్, గోపాలకృష్ణ, బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రామాయంపేట మున్సిపాలిటీ ప్రభుత్వ అనుమతి పొందిన లేఔట్ లో 10% భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



రామంపేట నవంబర్ 11 మహాప్రభ

మున్సి పార్టీ పరిధిలోని ప్రభుత్వ అనుమతి పొందిన లే అవుట్లలో 10% భూమిలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు – ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు : మున్సిపల్ కమిషనర్ రవీందర్ రామాయంపేట మున్సిపల్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ అనుమతి పొందిన లే అవుట్ లలో 10 శాతం భూమికి సంబంధించిన ఖాళీ ప్రదేశాలలో ఈరోజు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రవీందర్ గారు తెలిపారు. ఈ ఖాళీ ప్రదేశాలు మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ స్థలాలని, వీటిని ఎవరైనా ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా, అమ్మకాలు జరిపినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని ఆయన హెచ్చరించారు. అదే విధంగా ఈ ఖాళీ ప్రదేశాలలో కంచె ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే అన్ని వెంచర్లలో కంచె ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించవద్దని, మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ గారు విజ్ఞప్తి చేశారు.

ఇట్లు,

మున్సిపల్ కమిషనర్,

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి...

పాపన్నపేట నవంబర్11(మహాప్రభ)



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా....సీతానగర్ కి చెందిన మన్నె సత్తయ్య(54) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.కాగా గర్భవతిగా ఉన్న తన కూతురు అశ్వినీని హాస్పిటల్ లో చెకప్ కోసం ఈనెల 9న తన బైక్ పై ఎక్కించుకొని మెదక్ వెళ్లారు.తిరిగి సీతానగర్ కు వస్తుండగా యూసుఫ్ పేట గ్రామ శివారులో కోయ్య గుండు వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు వీరి బైక్ ను ఢీ కొట్టడంతో ఇద్దరు కింద పడగా సత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.అశ్వినికి సైతం స్వల్ప గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తం ఇద్దరిని అంబులెన్సులో మెదక్ లోని ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు హాస్పిటల్ కు అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు.మృతుడి కూతురు అశ్వినీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యస్ జి ఎఫ్ కరాటే పోటీలకు మెదక్ విద్యార్థుల ఎంపిక.



మెదక్ జిల్లా -11నవంబర్ (మహాప్రభ).

ఎస్ జి ఎఫ్ కరాటే పోటీలలో మెదక్ విద్యార్థుల ప్రతిభ కనబరిచి 12,13,14 తేదీలలో ఆసిఫాబాద్ జిల్లాలో జరగబోయేటువంటి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు అండర్ 17 విభాగం లో నరేందర్ -58, అఖిల్ ం82 ఎంపికైనట్లు కరాటే మాస్టర్ రెంజుకి శోటో కాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు నగేష్ తెలిపారు.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధిగా మెదక్ జిల్లా సెక్రెటరీ నాగరాజు వచ్చి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ దినకర్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యంలో పాల్గొని చిన్నారిని అభీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నేత, అడ్వకేట్ ఎర్ర కృష్ణ జాంభవ్



దేవరకొండ నవంబర్ 11(మహా ప్రభ)

చింతపల్లి మండలం కేంద్రంలో దేవరకొండ మండలం కొండ భీమనపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీ రెవెన్యూ అధికారి షబ్బీర్అండాలు కూతురు ఆయేషా శారీ ఫంక్షన్ లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్రె శంకర్ యాదవ్ ,లింగన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరిగేలా భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి

-- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

-నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడత రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలి.

-రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యత.. తొందర పాటుతో తప్పులకు తావివ్వకూడదు.

-మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు.

-భూముల రీసర్వే ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.



మెదక్ జిల్లా -11నవంబర్ (మహాప్రభ).

రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, సానుకూల వాతావరణంలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహించామని తెలిపారు.రీసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు.

రీసర్వే ఎస్ఓపీని పకడ్బందీగా అమలు చేయాలి

భూముల రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు.క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. కేవలం ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలు కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు ఉండాలని స్పష్టం చేశారు. నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రీసర్వే పనుల్లో అధికారులు పూర్తి బాధ్యతతో, చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

మండలాల వారీగా సర్వే బృందాల ఏర్పాటు

ప్రతి మండలంలో రీసర్వే కోసం అవసరమైన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు సర్వే బృందాల సంఖ్యను పెంచాలని తెలిపారు.

రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

రీసర్వేలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరి

రీసర్వే జరిగే సమయంలో సంబంధిత గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, స్థానిక రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు.

సర్వే నివేదికల పై అభ్యంతరాలు ఎలా సమర్పించాలి, ఎక్కడ సమర్పించాలి, ఏ విధంగా పరిష్కరించబడతాయి అనే అంశాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే వివరాలను ప్రజలకు తెలియజేస్తూ దండోరా వేయించాలని, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు.

ప్రజలకు రీసర్వే వివరాలు పూర్తిస్థాయిలో తెలియజేయాలని, వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రికార్డులు కచ్చితత్వంతో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అసైన్డ్ భూముల పట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములపై ఆధీనంలో ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని అనుభవిస్తున్నట్లయితే, ప్రస్తుత అనుభవదారుడు అర్హుడా కాదా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు.పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని తెలిపారు.

సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.రీసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా, రీసర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

దేవరకద్ర నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి బిజీబిజీ





-ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు

-నూతన గృహాల్లో అడుగుపెట్టిన కుటుంబాలకు ఎమ్మెల్యే కుటుంబం తరపున నూతన వస్త్రాల బహూకరణ

-గోపాన్‌పల్లి సమీపంలో వీరభద్ర రైస్ మిల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జీఎంఆర్



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 11 మహాప్రభ

దేవరకద్ర: నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తూ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవరకద్ర మండలంలోని నాగారం, మినిగోనిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదల సొంతింటి కల సాకారం కావడం ఆనందదాయకం

నాగారం, మినిగోనిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుని గృహప్రవేశాలు నిర్వహించుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన కుటుంబాలు నేడు తమ కలను సాకారం చేసుకుని నూతన గృహాల్లోకి ప్రవేశించడం సంతోషకరమైన విషయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి కేవలం నివాసం మాత్రమే కాదని, భద్రతకు, ఆత్మగౌరవానికి, భవిష్యత్తుకు ప్రతీక అని భావించే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరిన ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గృహప్రవేశాలు నిర్వహించుకుంటున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తన కుటుంబం తరపున నూతన వస్త్రాలను బహూకరించి అభినందించారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా కుటుంబ సభ్యుడిలా లబ్ధిదారుల సంతోషంలో పాలుపంచుకోవడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఎమ్మెల్యే చూపిన ఆత్మీయతకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



వీరభద్ర రైస్ మిల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

అనంతరం గోపాన్‌పల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన వీరభద్ర రైస్ మిల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్లును ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా పరిశ్రమను ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడం అభినందనీయమని పేర్కొంటూ, సంస్థ విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం స్థానిక ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందని, వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం లభిస్తుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. స్థానికంగా వ్యాపార కార్యకలాపాలు విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల మధ్యే ఎమ్మెల్యే.. వరుస కార్యక్రమాలతో సందడి

ఒకవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని వారి కుటుంబాల్లో సంతోషాన్ని పంచుకున్న ఎమ్మెల్యే, మరోవైపు నూతన రైస్ మిల్ ప్రారంభోత్సవానికి హాజరై వ్యాపారవేత్తలను ప్రోత్సహించారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించే కార్యక్రమాల్లో పాల్గొనడం ఈ పర్యటనలో ప్రత్యేకతగా నిలిచింది.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, రైస్ మిల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే జీఎంఆర్ ఆకస్మిక తనిఖీ





-కౌకుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో సేవలపై సమీక్ష..
అధికారులకు కీలక ఆదేశాలు
-కురుమూర్తి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నూతన నిర్మాణాలకు ప్రారంభోత్సవం

మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 11 మహాప్రభ

దేవరకద్ర: ప్రజలకు మెరుగైన పాలన అందించడంతో పాటు, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా కౌకుంట్ల మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ ప్రజలకు అందుతున్న సేవలు, వివిధ అంశాలకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను, ప్రజా సేవల తీరును పరిశీలించిన ఎమ్మెల్యే.. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని, ప్రతి ఒక్కరికీ పారదర్శకమైన సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు జాప్యం లేకుండా సేవలు అందించడమే అధికారుల ప్రథమ బాధ్యత అని పేర్కొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పరిశీలన.. ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఆదేశాలు

అనంతరం మార్గమధ్యంలో కౌకుంట్ల--వెంకటగిరి గ్రామాల మధ్య నూతనంగా నిర్మాణం పూర్తిచేసుకున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)ని ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణం, ప్రజలకు అందుబాటులోకి వచ్చిన రవాణా సౌకర్యాలను పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజలకు రాకపోకల్లో మరింత సౌలభ్యం కల్పించడంతో పాటు ప్రయాణ సమయం తగ్గించేందుకు ఆర్ఓబీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అదేవిధంగా మార్గమధ్యంలో ఉన్న పలు ప్రమాదకర ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేసేలా అవసరమైన హెచ్చరిక, సూచిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత ఎస్సైని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

కురుమూర్తి క్షేత్రంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు.. నూతన నిర్మాణాలు ప్రారంభం

మరోవైపు చిన్నచింతకుంట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సందర్శించారు. దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన దిగుడు మెట్ల మార్గాన్ని, దేవస్థానం నూతన కార్యనిర్వాహక కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా చేపట్టిన ఈ నిర్మాణాలు అందుబాటులోకి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పుణ్యక్షేత్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై ఆకస్మిక తనిఖీలు, మరోవైపు రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి, ఇంకోవైపు పుణ్యక్షేత్ర అభివృద్ధికి ప్రోత్సాహం.. ఇలా నియోజకవర్గంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎమ్మెల్యే జీఎంఆర్ చేపట్టిన పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

చిన్నరాజమూరులో ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి

పూర్ణకుంభ స్వాగతం.. శాలువాతో ఘన సత్కారం -- పాల్గొన్న మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు



మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 11 మహాప్రభ
దేవరకద్ర:

మండల పరిధిలోని చిన్నరాజమూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ ఆంజనేయస్వామిని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భీమాచారి, అన్వేషాచారి, శ్యామ్సుందరాచారి వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భరత్ కుమార్, ప్రేమ్ కుమార్ యాదవ్, ఆలయ అర్చకులు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ గ్రామం నుంచి తొలి న్యాయవాదిగా నేనావత్ విజయ్

-తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణస్వీకారం..
-మారుమూల గిరిజన యువకుడి ఘనతపై గ్రామస్థుల హర్షం



ఎల్లారెడ్డి, నవంబర్ 11, (మహాప్రభ)

మారుమూల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నేనావత్ విజయ్ న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేసి గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామం నుంచి తొలి న్యాయవాదిగా ఆయన నిలిచారు. బుధవారం తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదిగా ప్రమాణం చేశారు.

విజయ్ హైదరాబాద్లోని మార్వాడి శిక్షా సమితి లా కళాశాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధంతో న్యాయవిద్యను అభ్యసించారు. ఆయన తండ్రి నేనావత్ దేవిసింగ్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తుండగా, తల్లి నేనావత్ లక్ష్మి వ్యవసాయ పనులు చేస్తున్నారు. సోదరుడు నేనావత్ వికాస్ హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు.

ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. అన్యాయానికి తావులేకుండా న్యాయం కోసం పోరాడతానని తెలిపారు. తన గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తనను ప్రోత్సహించిన కుటుంబ సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

తిమ్మాపూర్ గ్రామం నుంచి తొలి న్యాయవాదిగా విజయ్ గుర్తింపు పొందడంపై గ్రామస్థులు, బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

శుభకార్యాల్లో సందడి చేసిన బీఆర్ఎస్ సీనియర్ నేత మందడి సరోజ్ రెడ్డి

-డోకూరు గ్రామంలో రవి వివాహ వేడుకకు హాజరు..
-వధూవరులను ఆశీర్వదించిన హైకోర్టు న్యాయవాది



మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 11 మహాప్రభ

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గంలో పలు శుభకార్యాలకు హాజరవుతూ ఆత్మీయులను పలకరిస్తూ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి సందడి చేశారు.

ఈ సందర్భంగా దేవరకద్ర మండలం డోకూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ అన్న కుమారుడు రవి వివాహ వేడుకకు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆప్యాయంగా ముచ్చటించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో జరిగే వివిధ శుభకార్యాలకు హాజరవుతూ ప్రజలతో మమేకమవుతున్న మందడి సరోజ్ రెడ్డికి స్థానికులు ఆత్మీయ స్వాగతం పలికారు.

మాజీ శాసన సభ్యుడు మల్లయ్యకు గౌడ సంఘం ఘన నివాళులు



మంథని, నవంబర్ 11 మహాప్రభ

గీత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం చట్ట సభలో గళ మెత్తిన మాజీ శాసన సభ్యుడు దేశిని చిన్న మల్లయ్య సేవలు చిరస్మరణీయమని మంథని గౌడ సంఘం నాయకులు కొనియాడారు. ఆయన తొమ్మిదో వర్ధంతి సందర్భంగా బుధవారం మంథనిలోని గౌడ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మంథని ప్రధాన కార్యదర్శి ఏగోళపు చిన్న శంకర్ గౌడ్, మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు ముఖ్య సలహాదారులు, మేడగోని రాజమౌళి గౌడ్ మాట్లాడుతూ శాసన సభలో గీత కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం కోసం దేశిని చిన్న మల్లయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. గీత కార్మికుల అభ్యున్నతి కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ గీత కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పాలకవర్గ సభ్యులు, సంఘం నాయకులు పాల్గొని దేశిని చిన్నమల్లయ్యకు ఘనంగా నివాళులర్పించారు..

హాజీలపూర్లో సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ నూతన గృహప్రవేశ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

-వాస్తుపూజలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఆల..
- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సందడి





మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 11 మహాప్రభ

దేవరకద్ర: మండలంలోని హాజీలపూర్ గ్రామ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ నూతన గృహప్రవేశం, వాస్తుపూజ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నూతన గృహంలోకి అడుగుపెడుతున్న ప్రభాకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డికి నిర్వాహకులు, కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆయన రాకతో కార్యక్రమంలో సందడి నెలకొంది. బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేడుక ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జెట్టి నరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ డోకూర్ నరేందర్ రెడ్డి, సత్యం సాగర్, దేవరకద్ర మున్సిపల్ కౌన్సిలర్ మాధవి యుగంధర్ రెడ్డి, రమేష్ గౌడ్, కొండ భాస్కర్ రెడ్డి, ఖదీర్ పాషా, బస్వాయిపల్లి శ్రీను తదితరులు పాల్గొని ప్రభాకర్ గౌడ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత న్యాయ సేవల్లో న్యాయవాదులు భాగస్వా ములు అవ్వాలి

ుసీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్



/మెట్ పల్లి నవంబర్ 11 మహాప్రభ

మండల లీగల్ సర్వీసెస్ ఆ ధ్వర్యంలో నిర్వహించే ఉచిత న్యాయసేవల్లో న్యాయ వాదులు భాగస్వాములు అ వ్వాలని మెట్ పల్లి సీనియ ర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా బుధవారం బా ర్ అసోసియేషన్ గదిలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత న్యా యసేవాల కోసం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించే విజ్ఞాన సద స్సులకు మరియు వివిధ సే వా కార్యక్రమాలకి న్యాయ వాదులు స్వచ్ఛందంగా స హకరించాలని విజ్ఞప్తి చేసా రు. సామాజికంగా ప్రజలు ఎదుర్కొనే అనేక రకాల న్యాయ సేవలు అందించేం దుకు మెట్ పల్లి కోర్టు కాంప్లె క్స్ లో మండల లీగల్ సర్వీ సెస్ సిబ్బంది సిద్ధంగా ఉ న్నారని తెలిపారు. ఆర్థికం గా న్యాయ సేవలు పొంద లేనివారికి సలహాలు, సూచ నలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రభుత్వ వసతి గృహాల్ని ఆకస్మిక తనిఖీ చేసి, విద్యార్థు ల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పత్రికా కథనాల ఆధారంగా కూడా అధికారులపై సుమో టా గా కూడా కేసులు నమో దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫస్ట్ క్లాస్ మె జిస్ట్రేట్ వినుకొండ మాధవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ద య్య రాజారాం, బార్ అసో సియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనం ద్ గౌడ్, అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీ జ్, లోక్ అదాలత్ మెంబర్లు వడ్డేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, మీడియాషన్ కో ఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వే ణు గోపాల్, పసునూరి శ్రీని వాస్, పారా లీగల్ కౌన్సిల్స్ పుప్పాల భానుమూర్తి, ఎలా ల మధుసూదన్ రెడ్డి, నేరెళ్ల శ్రీధర్ మరియు బార్ అసోసి యేషన్ సభ్యులు పాల్గొ న్నారు.

బిజినెస్

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

-హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలకు భారీ పతనం
-24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.710 తగ్గుదల
-రూ.1,41,980కు చేరిన 24 క్యారెట్ల పసిడి ధర
-22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.650 తగ్గింపు
-రూ.1,30,150 వద్ద కొనసాగుతున్న 22 క్యారెట్ల ధర
-కిలో వెండిపై ఒక్కరోజే రూ.5,000 పతనం
-రూ.2 లక్షలకు చేరిన కిలో వెండి ధర
-ధరల తగ్గుదలతో వినియోగదారులకు ఊరట



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు బుధవారం భారీగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.710 తగ్గి రూ.1,41,980కు చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.650 పతనమై రూ.1,30,150 వద్ద కొనసాగుతోంది. వెండి ధర కూడా భారీగా దిగివచ్చింది. కిలో వెండిపై ఒక్కరోజే రూ.5,000 తగ్గడంతో ధర రూ.2,00,000కు చేరింది. బంగారం, వెండి ధరలు ఒకేసారి తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. అయితే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను బట్టి స్థానిక పన్నులు, ఇతర కారణాలతో ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు.

దిగివచ్చిన కూరగాయల ధరలు.. సామాన్యులకు ఊరట

-తెలుగు రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గిన కూరగాయల ధరలు
-గతంలో కిలో రూ.100కు చేరిన ఉల్లిపాయల ధరకు బ్రేక్
-రూ.60 పలికిన టమాటా ధరలు కూడా దిగువకు
-నవంబర్ 11న కూకట్‌పల్లి రైతుబజార్‌లో అందుబాటులోకి చౌక ధరలు
-విజయవాడ రైతుబజార్‌లోనూ తగ్గిన కూరగాయల ధరలు
-టమాటా, ఉల్లిపాయలతో పాటు ఇతర కూరగాయల ధరల్లోనూ తగ్గుదల
-మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చులకు కొంత ఉపశమనం
-ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారుల అంచనా



తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగిరావడంతో సామాన్య ప్రజలకు కొంత ఊరట లభిస్తోంది. గతంలో ఆకాశాన్నంటిన ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో వినియోగదారులపై ఆర్థిక భారం కొంత తగ్గింది. ముఖ్యంగా గతంలో కిలో ఉల్లిపాయలు రూ.100 వరకు పలకగా, టమాటా ధర రూ.60కు చేరింది. దీంతో నిత్యావసర కూరగాయల కొనుగోలుకే సామాన్యులు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు వాటి ధరలు గణనీయంగా తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. నవంబర్ 11వ తేదీన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, విజయవాడ రైతుబజార్లలో టమాటా, ఉల్లిపాయలతో పాటు పలు రకాల కూరగాయలు గతంతో పోలిస్తే తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయి. ధరలు తగ్గడంతో వినియోగదారులు రైతుబజార్లకు వెళ్లి అవసరమైన కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా రోజువారీ కూరగాయల కొనుగోలుపై ఆధారపడే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఈ తగ్గుదల కొంత ఊరటనిస్తోంది. కూరగాయల ధరలు తగ్గడం వల్ల కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై ఒత్తిడి తగ్గుతోంది. గతంలో ధరలు అధికంగా ఉండటంతో తక్కువ పరిమాణంలోనే కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ధరలు అందుబాటులోకి రావడంతో అవసరమైన మేరకు కొనుగోలు చేసే అవకాశం ఏర్పడింది. అయితే ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ఎల్‌నినో ప్రభావం భవిష్యత్తులో కూరగాయల ధరలపై పడే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, పంటల దిగుబడిపై ప్రభావం వంటి అంశాలు సరఫరాను ప్రభావితం చేయవచ్చని భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం తగ్గిన ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. ప్రస్తుతం లభిస్తున్న ధరల తగ్గుదలతో వినియోగదారులకు ఊరట కలుగుతున్నప్పటికీ, రానున్న రోజుల్లో మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయన్న దానిపై ఆసక్తి నెలకొంది.

భారీ లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

-772.75 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
-210.40 పాయింట్ల లాభంతో 25,255.05 వద్ద నిఫ్టీ ముగింపు
-ఇంధన ధరల తగ్గుదల, విదేశీ నిధుల రాకతో మార్కెట్లకు ఊతం
-టాప్ గెయినర్లుగా మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్ షేర్లు
-3 శాతం లాభపడిన నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ
-ఐటీ, హెల్త్‌కేర్ రంగాల్లో మాత్రం బలహీనత
-మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీల్లోనూ వృద్ధి



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. కొనుగోళ్ల జోరుతో కీలక సూచీలు గణనీయంగా పుంజుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 772.75 పాయింట్లు లాభపడి 81,879.40 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 210.40 పాయింట్లు పెరిగి 25,255.05 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా ఇంధన ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడులు తిరిగి మార్కెట్లలోకి రావడం ఇన్వెస్టర్లలో సానుకూలతను పెంచాయి. దీంతో పలు రంగాల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్ షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ మూడు శాతం లాభపడింది. మరోవైపు నిఫ్టీ ఐటీ, హెల్త్‌కేర్ సూచీలు మాత్రం బలహీనంగా ముగిశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం లాభాలను నమోదు చేయడంతో మార్కెట్ మొత్తం మీద కొనుగోళ్ల సందడి కనిపించింది.

స్పోర్ట్స్

'శ్రేయస్.. నీ వెనక నేనున్నా'.. పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్

ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్
కెప్టెన్, కోచ్, జట్టు, మొత్తం పంజాబ్‌కు అండగా ఉంటానని వ్యాఖ్య
తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో టీమ్‌కు మద్దతుగా ఉంటానని సంకేతం
అతడి స్థానంలో ముంబై ఇండియన్స్‌లో చేరనున్న అర్ష్‌దీప్





ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా' అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పారితోషికం రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు. హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి

-పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కు ఆదరణ దక్కాలన్న ఫాతిమా సనా
-డబ్ల్యూబీబీఎల్‌లో పెర్త్ స్కార్చర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సనా
-ఈ లీగ్‌లో ఆడుతున్న రెండో పాకిస్థాన్ మహిళా క్రికెటర్
-2028 టీ20 వరల్డ్ కప్‌తో పెను మార్పులు ఖాయమన్న ఆశాభావం
-మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాక్



పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.

మ్యూజియానికి సచిన్ 26 బ్యాట్లు.. నవంబర్ 16న 'బ్యాటోగ్రఫీ'

-ఎంసీఏకు 26 బ్యాట్లు అందించనున్న సచిన్
-హెల్మెట్లు, జెర్సీలు, వ్యక్తిగత నోట్లూ ప్రదర్శనలో భాగం
-100 అంతర్జాతీయ సెంచరీలకు సంబంధించిన బ్యాట్లు కూడా ప్రదర్శనలోకి
-భవిష్యత్ తరాలకు సచిన్ క్రికెట్ ప్రయాణాన్ని పరిచయం చేయడమే లక్ష్యం




క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబై క్రికెట్ సంఘానికి (ఎంసీఏ) బహుమతిగా ఇవ్వనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చారిత్రక ఘనతలు సాధించేందుకు ఉపయోగించిన బ్యాట్లతో పాటు హెల్మెట్లు, జెర్సీలు, కీలక సందర్భాలకు సంబంధించిన వ్యక్తిగత నోట్లను కూడా ఎంసీఏకు అందించనున్నారు. వీటిని ముంబైలోని శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రత్యేక విభాగంలో ప్రదర్శించనున్నారు. 'బ్యాటోగ్రఫీ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శనను నవంబర్ 16న ప్రారంభించనున్నారు. సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రదర్శనను ప్రారంభించడం విశేషం. 2013 నవంబర్‌లో ముంబై వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌తో తన 200వ టెస్టు ఆడిన సచిన్.. అదే మ్యాచ్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికారు. సచిన్ క్రికెట్ ప్రయాణాన్ని ఆయన ఉపయోగించిన బ్యాట్ల ద్వారా పరిచయం చేయడమే 'బ్యాటోగ్రఫీ' ఉద్దేశం. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన చారిత్రక ఘనతకు తోడ్పడిన బ్యాట్లు కూడా ఇందులో ఉండనున్నాయి. వాటి వెనుక ఉన్న విశేషాలను తెలుసుకునే అవకాశం అభిమానులకు లభించనుంది. ఈ కార్యక్రమంపై ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ మాట్లాడుతూ.. భారత, ప్రపంచ క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు రికార్డులకు మాత్రమే పరిమితం కావని అన్నారు. కోట్లాది మంది అభిమానుల జ్ఞాపకాల్లో ఆయన ప్రయాణం భాగమైందని పేర్కొన్నారు. సచిన్ తన విలువైన జ్ఞాపికలను మ్యూజియానికి అందించడం గౌరవంగా భావిస్తున్నామని, తద్వారా భవిష్యత్ తరాల క్రికెట్ అభిమానులు ఆయన ఘనతలను మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రదర్శన ద్వారా సచిన్ కెరీర్‌లోని కీలక ఘట్టాలను, వాటితో ముడిపడిన జ్ఞాపకాలను భద్రపరచడంతో పాటు అభిమానులకు వాటిని ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగనుంది.



గ్లామర్ డోస్ పెంచేసిన శివాని

ఆస్కార్ రేసులో మరో భారతీయ చిత్రం..

ఇండిపెండెంట్ రూట్‌లో ప్రయాణిస్తున్న 'పైర్'!



ప్రఖ్యాత జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు వినోద్ కప్రి తెరకెక్కించిన 'పైర్' (గ్రామీణ) సినిమా ఆస్కార్ బరిలో నిలిచింది. ఎలాంటి పెద్ద బ్యానర్లు లేకుండా, పూర్తిగా స్వతంత్ర పద్ధతిలో ఈ చిత్రాన్ని 99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) జనరల్ ఎంట్రీ విభాగాల కోసం పంపినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. చిన్న చిత్రాలు కూడా తమ ప్రతిభ ఆధారంగా నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడాలనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వినోద్ కప్రి తెలిపారు. హిమాలయ ప్రాంతాల నేపథ్యంలో సాగే ఈ హృదయ విదారక కథా చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకోవడం విశేషం.ఈ చిత్రం గురించి దర్శకుడు వినోద్ కప్రి మాట్లాడుతూ, తాము ఈ సినిమాను పూర్తిగా స్వతంత్రంగా, కథపై ఉన్న నమ్మకంతోనే తెరకెక్కించామని తెలిపారు. హిమాలయాలకు చెందిన ఒక మారుమూల గ్రామానికి చెందిన సాధారణ వృద్ధ దంపతుల కథ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది హృదయాలను హత్తుకుంటుందని తాము ఊహించలేదన్నారు. స్వతంత్ర చిత్రాలు కూడా ఎలాంటి అడ్డంకులను ఎదుర్కొంటూ తమ కథలను ప్రపంచానికి చాటిచెప్పవచ్చని, అందుకే ఈ ఇండిపెండెంట్ సబ్మిషన్ రూట్ ఎంచుకున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, 99వ ఆస్కార్ అవార్డుల కోసం భారత్ నుంచి సంతోష్ దావఖర్ తెరకెక్కించిన మరాఠీ చిత్రం 'గొంధల్' అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. అలాగే తేజా రియో దర్శకత్వం వహించిన 'అంగ్' చిత్రం కూడా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో అవార్డు గెలుచుకోవడం ద్వారా ఆస్కార్‌కు అర్హత సాధించింది. హిమాలయాల నేపథ్యంలో తెరకెక్కిన 'పైర్' చిత్రంలో ఉత్తరాఖండ్‌కు చెందిన పదం సింగ్, హీరా దేవి అనే ఇద్దరు సాధారణ వృద్ధులు ప్రధాన పాత్రల్లో నటించారు. దశాబ్దాలుగా తమ కొడుకు రాక కోసం ఎదురుచూసే వృద్ధ దంపతుల దైనందిన జీవితం, ఒంటరితనం, వలసలు, అనుబంధాల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఇప్పటివరకు ఈ సినిమా అంతర్జాతీయ వేదికలపై 15 'ఉత్తమ చిత్రం' అవార్డులతో పాటు మొత్తం 18 పురస్కారాలను కైవసం చేసుకుంది. అక్టోబర్ 30న హిందీలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అయితే, భారీ బడ్జెట్ సినిమా 'రామాయణం' విడుదల నేపథ్యంలో థియేటర్లలో తమ చిత్ర ప్రదర్శనలను తగ్గించమని ఒత్తిడి తెచ్చారని ఇటీవల వినోద్ కప్రి ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఇమ్రాన్ హష్మీ, జెనీలియా 'గన్‌మాస్టర్ జి9' ట్రైలర్ విడుదల.!



బాలీవుడ్ స్టార్ హీరో ఇమ్రాన్ హష్మీ, వర్సటైల్ నటి జెనీలియా దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గన్‌మాస్టర్ జి9' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా ద్వారా ఇమ్రాన్ హష్మీ మరోసారి తనదైన శైలిలో యాక్షన్ మరియు రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.ప్రముఖ దర్శకుడు ఆదిత్య దత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ హిమేష్ రిషమియా సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు మరియు సంగీతం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, జెనీలియా జోడీ మొదటిసారి తెరపై నటిస్తుండటంతో వీరి మధ్య ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అపర్శక్తి ఖురానా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని దీపక్ ముకుట్, హునార్ ముకుట్ మరియు సంగీత అహిర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

పెళ్లికి వేళయింది

న్యూస్ రీడర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టి అనంతరం సినీరంగంలో అడుగుపెట్టి విజయాల్ని అందుకుంది కథానాయిక ప్రియా భవానీ శంకర్. తమిళ ప్రేక్షకులకు సుపరిచితురాలైన ఈ భామ 'ఇరుముడి' చిత్రంతో తెలుగువారికి కూడా చేరువైంది. తాజా సమాచారం ప్రకారం ఈ సాగసరి పెళ్లిపీటలెక్కబోతున్నట్లు తెలుస్తున్నది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రియుడు రాజవేల్ రాజన్‌తో కలిసి తీయించుకున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.ఈ ఫొటోల్లో సంప్రదాయ దుస్తుల్ని ధరించిన ఈ జంట మెడలో మల్లెపూల దండలు, నుదుటిపై చందనం బొట్లు పెట్టుకొని కనిపిస్తున్నారు. వీటిని చూసిన అభిమానులు ప్రీ వెడ్డింగ్ వేడుక ఏమైనా జరిగిందా? త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే తమ వివాహంపై ప్రియా భవానీశంకర్, రాజవేల్ రాజన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాలేజీ రోజుల నుంచే ఈ జంట ప్రేమలో ఉన్నారని, గత కొంతకాలంగా సహజీవనం సాగిస్తున్నారని సమాచారం. ప్రియా భవానీ శంకర్ ప్రస్తుతం 'డిమోంటే కాలనీ-3'లో నటిస్తున్నారు.


మైత్రీ మూవీ మేకర్స్‌తో సినిమా?



మలయాళంలో అగ్ర హీరోగా కొనసాగుతూనే తెలుగులో కూడా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు దుల్కర్ సల్మాన్. సీతారామం, లక్కీ భాస్కర్ చిత్రాలతో తెలుగులో ఆయన మంచి మార్కెట్‌ను క్రియేట్ చేసుకున్నారు. దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో తెలుగులో ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌లో ఆయన ఓ సినిమా చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని, త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు. అయితే ఈ చిత్రానికి దర్శకుడు ఎవరనేది తెలియాల్సి ఉంది.

మెగాస్టార్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్న వశిష్ఠ!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది.విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, ఆశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com